# ఫాక్స్‌ట్రాట్

డిసెంబర్ 25-1945

అర్ధరాత్రి దాటిపోయింది. పొగమంచులోంచి వెన్నెల కురుస్తోంది. చలి చిక్కబడుతూ ఒణికించేస్తోంది.

యూరోపియన్ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో బాల్‌డాన్స్-శాక్సోఫోన్, ట్రాంబోన్, పియానో వాద్యాలతో స్టేజి మీద మ్యూజికల్ సింఫనీ. ఆర్కెస్ట్రాలో ప్రత్యేకించి డబుల్ బేస్ తంత్రీనాదాలు ఆరోహణా స్థాయిలో మోగుతున్నాయి.

లయబద్ధంగా సున్నితమైన డ్రమ్ బీట్స్‌తో హుందాగా ఫాక్స్‌ట్రాట్ డాన్స్ - దొరలు డాన్స్ సూట్స్‌లోనూ, దొరసానులు మడమల్ని జీరాడే డాన్సింగ్ గౌన్స్‌లోనూ, ఆపాశ్చాత్య సంగీతానికి స్టెప్స్ వేస్తూ పాలిష్‌చేసిన వుడెన్ బోర్డ్ ఫ్లోర్ మీద గ్రేస్‌ఫుల్‌గా జంటలు జంటలుగా ఊగుతున్నారు.

రాస్; డాన్స్‌హాల్‌లో ప్రవేశించగానే అందరి కళ్లు అతని మీద ఒక్కసారి పడ్డాయి. డ్రయివర్ రాస్ నల్లటి డాన్సింగ్ సూట్‌లో, నల్లటి బౌతో ఎర్రగా, సన్నగా, నిటారుగా చేవదేరిన రక్త చందనం బొమ్మలా ఉన్నాడు.

మేరీ అందరికంటే ముందుగా లేచి డాన్స్ పార్ట్‌నర్‌గా రాస్ కి చెయ్యి అందించింది. ఇద్దరూ కలిసి డాన్స్‌ఫ్లోర్‌లోకి వచ్చారు. వేలాడుతున్న శాండ్లియర్స్ మసగ కాంతిలో మేరీ నడుం మీద చెయ్యి వేసి డాన్స్ చేస్తున్నాడు. మేరీ శాటిన్ గౌను రాస్ సూట్‌ని మెత్తగా రాసుకోంటోంది. ఫాక్స్‌ట్రాట్- స్టెప్స్ వేస్తూ ఊగుతున్నారు.

అందరి కళ్లు రాస్ మీదే !

రాస్ మాత్రం పరధ్యానంగా డాన్స్ చేస్తున్నాడు. అతని నీలి కళ్లు మేరీ పిల్లి కళ్లలోనికిగాని, దిద్దుకున్న ఎర్ర పెదాలపై గాని, అద్దుకున్న గులాబీ చెక్కిళ్ళపైగాని లగ్నం అవటం లేదు. ఆ అమ్మాయి శరీరపు వంపులు గాని డాన్సు భంగిమలు గాని ఆనందించటం లేదు. పరధ్యానంగా ఊగుతునే ఇంట్లో ఉండిపోయిన తన భార్య కేథరైన్ (కేటీ) గురించే ఆలోచిస్తున్నాడు. రైలు నడుపుతున్నా, ఇంట్లో ఉన్నా ఎల్లప్పుడూ కేటీ ధ్యాసే.

మేరీ రాస్‌ని ఆకర్షించే తమకంలో తొట్రుపడి రాంగ్ స్టెప్ వేసి రాస్ కాళ్లని తొక్కేసుకుంటూ తూలిపోబోయింది. రాస్ ఆమెను పడిపోకుండా పట్టుకొని సరిగ్గా డాన్స్ రాదని తెలుసుకుని అపాలజిటికల్‌గా విత్‌డ్రా అయిపోయి డాన్స్ ఫ్లోరు నుంచి బయటకు వచ్చేశాడు.

మేరీ వాలకం చూసి అందరూ గొల్లున ఎగతాళిగా నవ్వుతున్నారు. మిగతా అమ్మాయిలు రాస్‌తో డాన్స్ చేయడానికి అర్రులు చూస్తూ చేయి చూపుతూ ఇన్వైట్ చేస్తున్నారు. ఆ గొడవకి విసుక్కుంటూ డాన్స్ నిర్వహిస్తున్న ''ఎమెసీ''- బిహేవ్ యువర్ సెల్ఫ్ ప్లీజ్- అని సున్నితంగా మందలించాడు. శాక్సోఫోన్ వాద్యంతో తిరిగి బాల్ డాన్స్ మొదలయింది.

రాస్ పరధ్యానంగా కేటీని తలుచుకుంటూ మరో పార్ట్‌నర్‌తో ఫ్లోర్‌లో అడుగుపెట్టాడు. రాస్

వయసు ఇరవై నాలుగుంటుంది. కేటీ నలభై అయిదు దాటిన వితంతువు. రెండు సంవత్సరాల క్రితం ఇంగ్లండ్‌లో పెళ్లి చేసుకున్నాడు.

ఇన్‌స్టిట్యూట్‌కి దగ్గరలోనే ఉన్న రాస్ బంగళాకి వేలాడుతున్న క్రిస్టమస్ స్టార్ పొగమంచులోంచి, మసగ మసగ్గా కనిపిస్తోంది. లైట్లు ఆర్పేసిన బంగళా చీకటిగా ఉంది. హాల్లో వెలుగుతున్న బల్బు కాంతి మాత్రం కిటికీ అద్దాలలో నించి వరండా మీద పడుతోంది.

కేటీ ఒక్కర్తే కుర్చీలో హాల్లో కూర్చొనుంది. చేతిలో విస్కీ గ్లాసు. టేబిల్ మీద బాటిల్;... తాగుతోంది. కిటికీలో నుంచి నక్షత్రాలు పరుచుకున్న అనంతాకాశంలో నించి గతాన్ని చూస్తోంది.

రెండవ ప్రపంచ మహా సంగ్రామం జరుగుతోంది.

ఉత్తరాఫ్రికా సమరాంగణంలో భీకర పోరాటం. సంకీర్ణ దళాలు శత్రు స్థావరాల మీద విరుచుకు పడుతున్నాయి. జర్మన్ జనరల్ ''ఎడారి నక్క'' రోమల్ తన అసమాన రణజిత్తులతో ఎదురు దెబ్బలు తీస్తున్నాడు. రణ క్షేత్రం నుంచి విక్కీ తన వితంతు తల్లికి ఉత్తరం రాశాడు.

''డియర్ మామ్–

ఇప్పుడే శత్రువుల కీలక లక్ష్యాల మీద బాంబు దాడి చేసి సురక్షితంగా బేస్‌కి చేరుకున్నాను. విమానం కొద్దిగా దెబ్బతింది. మన ఎలైడ్ దళాలు 'డిసెర్ట్ ఫాక్స్' ని వెంటాడుతున్నాయి. ఉయ్ విల్ హంట్ డౌన్ దట్ ఫాక్స్. తుది విజయం మనదే. క్రిస్టమస్‌కి వస్తున్నాను. విజయోత్సాహంతో క్రిస్టమస్ జరుపుకుందాం – ఉంటానూ–

ప్రేమతో–విక్కీ.''

అలాంటి క్రిస్టమస్‌లు రెండు దాటిపోయాయి. తన ఇరవై యేళ్ల ఒక్కగానొక్క కొడుకు తిరిగి రాలేదు. రాడు. తను నడుపుతున్న విమానం జర్మన్ శతఘ్నుల కాల్పుల్లో గగన తలంలోనే పేలి పోయి మంటలతో ఎడారిలో కూలిపోయింది.

ప్రతి క్రిస్టమస్‌కి మాతృహృదయం కొడుకుని తలుచుకొంటూ గిలగిల లాడిపోతోంది. దూరంగా ఇన్‌స్టిట్యూట్‌లో బాల్‌రూమ్ డాన్స్ ఆర్కెస్ట్రా వినిపిస్తోంది.

గతంలో నుంచి వర్తమానంలోకి మెల్లగా జారుకొంటూ కొడుకుని తలుచుకొంటూ బైట కురుస్తున్న మంచు తెరల్లోంచి శూన్యంలోకి చూస్తోంది.

గదిలో వేలాడుతున్న పంజరంలో నుంచి చిలక ''మామ్, మామ్, మామ్'' అని అరుస్తోంది. ఆ అరుపులు పరధ్యానంగా వింటూనే''స్వీట్ గర్ల్, కీప్ క్వయిట్!'' అంటూ చెమర్చిన కళ్లని తడుముకుంటూ కుర్చీలో చేరబడింది. సీలింగుకు వేలాడుతున్న గాజు కుప్పెలో నుంచి బల్బు కాంతి పల్చటి వెలుగు పొరలా పరుచుకొనుంది. ఫైర్ ప్లేస్ నుంచి మంటలు వేడిని చిమ్ముతున్నాయి.

వెన్నెట్లో చీకటి ఆవరించుకున్న బంగళా, చుక్కల కాంతితో కడిగినట్లున్న ఆకాశపు మసగ నలుపు నేపథ్యంలో చెక్కిన మౌన శిల్పంలా వుంది.

బంగళా ఆవరణలో మర్రిచెట్టుకి వేలాడుతున్న గబ్బిలాలు దెయ్యపు పిల్లల్లా ఎగురుతూ, అరుస్తూ వెన్నెలలో పురుగుల్ని వేటాడుతున్నాయి. ఫైర్ ప్లేస్‌లోని మంటలకు గది వేడెక్కుతూ వెచ్చగా ఉంది. ఉండుండి మంటల్లో నిప్పు కణికలు చిట్లుతున్నప్పుడల్లా ఎర్రటి కాంతి గదిలో అద్దాలలో ప్రతిఫలిస్తూ విద్యుత్ కాంతితో కరిగి నారింజ రంగులో అలుముకుంటోంది.

కేటీ సోఫాలో చతికిలబడి ఆలోచిస్తూ బల్లమీద గ్లాసు లోంచి విస్కీ సిప్ చేస్తోంది. అంత చలి లోనూ వెచ్చటి గదిలో శరీరం విస్కీతో అంచెలంచెలుగా మత్తుగా వేడెక్కుతోంది. మరో పెగ్గు-ఇంకో పెగ్గు- ఆమె పిల్లి కళ్లు ఎర్రటి జీరలు తేరి పులికళ్లలా మత్తుగానూ మగతగానూ మారు తున్నాయి. ఆ మగతలో తన కొడుకు జ్ఞాపకం వస్తున్నాడు. కరిగి పోతున్నాడు... కట్ అయి పోతున్నాడు.

చిలక పంజరంలో గెంతుతూ తలక్రిందులుగా వేలాడుతూ దొరసాన్ని నిక్కి నిక్కి చూస్తోంది. గదిలో ప్రతి వస్తువూ కేటీకి నిషాలో వక్రీభవించి ఊగుతోంది. రాస్ కిస్ చేస్తున్నట్లు ఒళ్లంతా గగుర్పొడుస్తోంది. పెదాలు వణుకుతున్నాయి. మత్తులో మాతృత్వం, విషాదం, ఆనందం, కైపు గజిబిజిగా కలిసిన కాక్ టెయిల్లా వుంది.

కేటీ లేచి తమాయించుకొని నిల్చుంది. నిలువుటద్దంలో తన రూపం చూసుకొంది. అంత వయస్సులోనూ ఇంకా వంపులు దేరిన అవయవాల బింకాన్ని చూసుకొని తన రూపాన్ని తానే ''ఇన్‌క్రెడిబుల్ బ్యూటీ'' అని అభినందించుకొంటూ విరగబడి వికావికలుగా నవ్వుకుంటూ అద్దంలో ప్రతిబింబిస్తున్న తన రూపాన్ని తనివితీరా ముద్దులాడింది. గులాబీ రంగు పూసుకున్న పెదాల ముద్రలు జిడ్డు జిడ్డుగా అద్దం మీద అద్దుకున్నాయి. గ్లాసులో విస్కీ మళ్లీ పోసుకొని నోటినిండా నింపుకొని సగం మింగుతూ సగం పుక్కిలించుకుంటూ మత్తుతో తివాసీ మీద మెత్త మెత్తగా తమాయించుకొని అడుగులేస్తూ ఫైర్ ప్లేస్‌లోకి నిర్లక్ష్యంగా తుపుక్కున ఉమ్మింది. విస్కీ పడి మంట భగ్గున లేచింది. ఆ కాంతిలో కేటీ ముఖం, మత్తుపానీయంతో ఉబ్బి జేవురించిన చెక్కిళ్ల తో కందగడ్డలా మొరటు అందాన్ని సంతరించుకొంది.

బాల్ డాన్స్‌లో ట్రంపెట్ బ్లేర్ మంటూ చీకట్లని చీల్చుకుంటూ ఇన్‌స్టిట్యూట్ నుంచి వినిపి స్తోంది....

★ ★ ★

బయట వణికించే చలిలో, చెట్ల నీడల్లో నుంచి దాటుకుంటూ నక్కుతున్న నక్కలాగ బంగళా లోకి అప్పారావు ప్రవేశించాడు. అప్పారావు కోడిపిల్లల్ని ఎత్తుకుపోయే గుంట నక్కలా లేడు. పులి ప్రాపకానికి బయలు దేరిన ముదర నక్కలా ఉన్నాడు. బితుకు బితుకు మంటూ బంగళాకి ఆను కొన్న అవుట్ హౌసులోకి తొంగి చూశాడు. వంటవాడు రహీమ్ నిద్రపోతున్నాడు.

అప్పారావు తలుపు తడుతూ లేపాడు. రహీమ్ లేచి ఆవలిస్తూ

''అప్పారావ్! ఇంతరాత్రపుడు ఎందుకొచ్చావురా?'' అన్నాడు ఆశ్చర్యంగా

''ఒరే రహీమ్, ఇంట్లో దొర ఉన్నాడా?''

''లేడు. క్రిస్టమస్ కదా! డాన్స్‌కి వెళ్లాడు. ఏ తెల్లవారో వస్తాడు !''

'' ఒరేయ్ , దొరసాని ఇంట్లో ఉందా? తెలిగేసుందా?''

''దొరసాని ఒక్కర్తే బంగళాలో ఉంది. ''సాయంకాలం నుంచి తెగ మందు కొట్టేస్తూ ఉంది. దొర ఎంత పిలిచినా డాన్స్‌కి వెళ్లలేదు. ఇందాకే చూసొచ్చాను. మంచి పట్టులో ఉంది''.

''ఒక్కర్తే ఉంది కదా! దొరసానితో మాట్లాడాలిరా. తిడతాదేంటి?''

''ఒరేయ్, పిచ్చిలంజకొడకా ఈ రాత్రప్పుడు దొరసాని దగ్గరకెళ్లి మాట్లాడతావా? ఇంకేమన్నా

ఉందా! మనిషి దేవతే గాని- తాగేసుంది- ఏమో !'' అని నసిగాడు.

''ఒరేయ్ , నీకాళ్లు పట్టుకుంటాను. ఎలాగైనా మాట్లాడించరా. దొరసాని ఏమైనా చెప్తే దొర వింటాడా?''

''అంత అర్జంటు పని ఏమొచ్చిందిరా , ఈ రాత్రప్పుడు! పిడతనాకొడకా, దొర దగ్గర డ్యూటీ ఎగదొబ్బుతున్నావేంటి?''

''రహీమ్, ఈ దొరనాకొడుకు మంచోడే గాని, దురితం ఎక్కువరా. చిన్న తప్పుకు కూడా చేతికొచ్చిన దెబ్బ కొట్టేస్తున్నాడు. అక్కడా ఇక్కడా అని చూసుకోడు. తల బొప్పెలు కట్టిపోయింది. సరే, ఇక ఇంగ్లీషు తిట్లకి లెక్కలేదనుకో. ఇంజనులో స్టీము ఎక్కక పోతే జబ్బలు ఊడిపోయేదాక బొగ్గు కొట్టిస్తాడు. ఏమాత్రం స్టీము పడిపోయిందా, జెల్లమీద జెల్ల లాగేస్తున్నాడు ! ఒరేయ్, దొరసాని మాటంటే దొర కొట్టీడంట కదా! గొప్పగురంట?''

''గురా ! దాని దగ్గర ఈడు కుక్క ! దాని మాటంటే మాటే! ? కాదంటే మింగేదూ. తిరుగు లేదు. దొరసానితో మాటాడుతానంటున్నావు. ఊ, బాగానే ఉంది గాని .. ఈ రాత్రప్పుడా.. ఊ..''

''బాబ్బాబు, నీ కాళ్లు పట్టుకుంటాను. తీసికెళ్లరా!'' అని జేబులోంచి పావలా కాసు తీసి రహీమ్ చేతిలో జబర్దస్తీగా పెట్టేశాడు. పావలా పడగానే రహీమ్‌కి హుషారెక్కింది.

''తీసికెళ్తానుగాని, జాగ్రత్త ! ఈ సంగతి దొరకి తెలిసిందా నీకూ, నాకూ ఉద్యోగంలోంచి గెంటేస్తాడు. ఒరేయ్ దొరసాని దగ్గర చాలా వినయంగా ఉండాలి సుమా. అసలే తాగేసుంది సుమా-''

''కాళ్లమీద పడిపోయేదేమిటి?''

''అమ్మ, నక్క నా కొడకా! నీకు జిత్తులు నేర్పాల్రా? దొరకి కళ్లు కప్పి ఇంజన్లో బొగ్గులు అమ్ముకు దొబ్బినోడివి నీకు చెప్పాలా.. సరే .. రా!''

బంగళా వరండా ఎక్కారు ఇద్దరూ. గదిలో నుంచి చిలక చూసినట్లుంది. కేర్ కేర్ మని సకిలిస్తూ ఫకాఫ్.. ఫకాఫ్.. ఫకాఫ్ అని అరుస్తోంది. ''ఇదొకట్రా, బూతు చిలక. దీన్ని దొరసాని కలకత్తాలో కొని తెచ్చుకుంది. దీనికి రెండే రెండు మాటలొచ్చు. దొరసాన్ని 'మామ్' అనిపిలుస్తాది. ఎవడైనా మగాడు కనిపిస్తే చాలు ఫకాఫ్ .. ఫకాఫ్ అని బూతులు లంకించుకుంటుంది''.

చిలక అరుపు విని గదిలోనుంచి దొరసాని ''కోన్‌హై'' అని కేకేసింది. ''తెలిగేసే ఉందిరా.. జాగ్రత్త సుమా, దొరసానికి వచ్చీరాని హిందీ తప్ప మరే భాష రాదు. అక్కడక్కడ తెలుగు ముక్కలు మాట్లాడతాది. చూసుకో !''

''మేమ్‌సాబ్, ఆగ్‌వాలా అప్పారావు ఆయా, బాత్ కర్నేకో. పెర్మిషన్ మాంగ్తా హై !''

''కోన్? ఓ ఐసీ ఫైర్‌మన్ అప్రావ్? ఆనేకో బోలో- తుమ్ జావ్! ''

అప్పారావు అడుగు పెడుతూనే దొరసాని కాళ్లమీద దబాలున సాష్టాంగ పడిపోయాడు. కాళ్లలో పాము పడినట్లు తుళ్లిపడి సర్దుకుంటూ,

''క్యారే- అప్రావ్- గెటప్ మాన్- క్యాహువా? వాట్‌మేన్? '' అంది కేటీ

అప్పారావు లేచి చేతులు కట్టుకొని నిలబడ్డాడు.

''బైటోరే అప్రావ్- సిట్ మేన్! కుఛ్ పరవానై. యువర్ దొర, గాన్ ఫర్ డాన్సింగ్. లడికీ కాసాత్ నాచ్ కర్తారే !'' అని మత్తులో కుడి చేతితో విస్కీ గ్లాసు ఎత్తిపట్టుకుని ''వన్, టూ, త్రీ, ఫోర్'' అని స్టెప్స్ వేస్తూ వెకిలిగా నవ్వింది. మరో ప ట్టు బిగించింది. నాలిక తడారి పోయి గుటకలు మింగుతోంది.

చిలక ''మామ్, మామ్'' అని అరిచింది.

''కీప్ క్వయిట్ మై డియర్ పోలీ!'' అని అప్పారావు కేసి తిరిగి ''ఆజ్ క్రిస్టమస్ హైనా? హమారా అంగ్రేజి లోగ్‌కా బడా ఫెస్టివల్ ! మజాకరో! కేక్ ఖాయేగా?''

''నై, మేమ్ సాహెబ్!''

''విస్కీ పీయెగా?'' అని వెకిలిగా కన్నుకొట్టింది. ''తుమారా మాస్టర్ కో నహీ బోలూంగీ! పీ యొరె అప్రావ్!''

''మాఫ్‌కరో, మేడమ్!''

''అచ్ఛా!'' పెదాలికి అంటిన విస్కీ బొట్లని నాలికతో చప్పరించుకొంటూ టేబిల్ మీద గ్లాసు పెట్టి రాకింగ్ చైర్‌లో చేరబడింది. క్రిందన నేల మీద దొరసాని పక్కగా అప్పారావు కూర్చున్నాడు. గది నిండా విస్కీ మత్తు వాసన. కేటీ టేబిల్ మీద సిగరెట్టు పాకెట్టు అందుకోబోయింది. మధ్యలోనే అప్పారావు సిగరెట్టు పెట్టి తీసి దొరసాని కందివ్వబోయాడు.

చేత్తో అందుకోకుండా నోరు చాచింది. అప్పారావు దొరసానినోటికి సిగరెట్టు అందించి అగ్గిపుల్ల కొట్టి వెలిగించాడు. ఆ వెలుగులో రంగు పూసుకున్న పెదాలు, రోజ్ అద్దుకున్న చెక్కిళ్లు నున్నగా, జిడ్డుగా మెరుస్తున్నాయి. దమ్ములాగుతూ పొగని శూన్యంలోకి వదులుతూ

''అప్రావ్, బాల్ బచ్చాకైసాహై?''

''జీ, మేమ్ సాబ్!''

''పైసా మాంగ్ తాహై ?''

''నో, మేమ్ సాబ్!''

''అచ్ఛా అచ్ఛా ! అప్రావ్ ఏక్ బాత్ పూఛే గా; సచ్‌బోలేగా? ష్యూర్?''

''జీ మేడమ్!''

''ఝూట్‌నై బోలేగా?''

''నై, మేడమ్ ! ఆప్ కాపైర్ కాకసం- ఝూట్ నహీ బోలూంగా!''

''ష్యూర్, సచ్ అప్రావ్ ! ఇదరావ్ ! అని దగ్గరగా పిలిచి కూర్చున్న అప్పారావు చెవిలో సీక్రెట్ గానూ, చిలిపిగానూ, ఎగతాళిగానూ

''అప్రావ్ తుమారా మాస్టర్ ఔర్ కోయీ దొరసాన్లకూ ఫైరింగ్ కర్తారే?''

అప్పారావుకి షాక్ కొట్టినట్లయింది. తడబడి పోతూ ''నై..నై.. నో, మేమ్ సాబ్ ! మాస్టర్ బహుత్ అచ్ఛా ఆద్మీహై. తుమ్‌కో బహుత్ పసంద్ కర్తాహై. లవ్ కర్తాహై.''

''మాస్టర్ బహుత్ లవ్ కర్తారే ; అచ్ఛా ! క్రేజీ పంక్, మేకింగ్ లవ్ '' అని తెరలు తెరలుగా తనలో తానే కులుకు నవ్వులతో

''ఉపరతి, సమరతులందేలుచూ ఆత్మాహ్లాదకరంబుగా'' అని పొంగిపోతున్న మదనార వింద

సత్యభామలాగ, కైపుతో బిగువెక్కుతున్న పక్షోజాల్ని అద్దంలో చూసుకుంటూ చిత్ర విచిత్రాను భవాల్ని నెమరు వేసుకొంటూ రాకింగ్ ఛైర్‌లో ఊగుతోంది.

మధ్యలో ఉండుండి అప్పారావు కొంచెం కొంచెం విస్కీ గ్లాసులో పోసి దొరసానికి అందిస్తు న్నాడు. సిగరెట్టు మీద సిగరెట్టు నోటికి అందించి వెలిగిస్తూనే ఉన్నాడు.

ఇంజన్లో స్టీమ్ డ్రాప్ అవుతున్నపుడు తిరిగి ఫైర్ చేస్తున్నట్లు ఫైర్‌మన్ అప్పారావు దొరసాని నిషా పడిపోకుండా విస్కీ పోస్తున్నాడు.

నిషా పరాకాష్ఠకి చేరుకొంటోంది.

అలా ఎంతసేపయిందో!

ఆ మత్తులో మగతగా ఏదో స్పష్టాస్పష్టంగా వినిపించింది. తలెత్తి చూసింది. అప్పారావు బెక్కుతూ కళ్లు తుడుచుకుంటున్నాడు. దొరసాని తల తిప్పగానే జాలిగా రెండు చేతుల్తో కాళ్లు పట్టుకొని, కాళ్ల మీద తల ఆనించి కుమిలిపోతున్నాడు.

'' అప్రావ్! క్యారే-క్యాహువా మేన్? రోతాహై-వీపింగ్? క్యా?''

''మేడమ్, తుమ్ హమారా మా హై, అమ్మా హై! బచావో! బచావో, రక్షాకరో!''

''మామ్, మామ్!'' చిలక కూడా పిలుస్తోంది.

కాళ్లు విదిలించుకుని ''బోలో మేన్, క్యాహువా?''

''మాస్టర్ బహూత్ ట్రబుల్ దేతా హై మేమ్ సాబ్... డ్యూటీ మె బహుత్ తంగ్ కర్తాహై!''

''క్యామేన్, దొరా హైరానా కర్తాహైరే? తుమ్ కుచ్ బద్మాష్ కామ్ కియా డ్యూటీమె?''

''నై, మేడమ్-సాబ్ బహూత్ మార్తాహై-డ్యూటీ మె చోటీ గల్తీ హో నేసే మార్ మార్ కర్ జాన్ నికల్దేతాహై'' అని వల వల ఏడ్వటం మొదలు పెట్టాడు.

''చుప్ రహో.. మత్ రోరే.. కుచ్ ఫరవానై-హం తుమారే మాస్టర్‌కి బోలేగీ.''

ఇంకా వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు అప్పారావు. ''రక్షాకరో మా, బచావో!''

'' తుమారా మాస్టర్ కు మై సమజాంగీ-డోంట్ క్రై మేన్-కల్‌సె తుమ్‌కో కుచ్ నహీం హోగా''.

''దేఖో, మేమ్ సాబ్, మాస్టర్ కైసామారా!'' అని తలమీద నిజంగా దొరకొట్టిన దెబ్బల్ని, చిన్నప్పుడు కోతి కొమ్మచ్చి లాటలో పడిపోయిన తల మీద పాత దెబ్బని కలిపి దొరసానికి చూపిస్తూ కుళ్లి కుళ్లి ఏడుస్తున్నాడు.

''మామ్, మామ్!'' అని చిలక పిలుపు.

''మేడమ్, ఆప్ మేరా ''మా'' అమ్మ; మామ్!'' అప్పారావు ఏడుపు.

చరాలున యుద్ధ భూమిలో కూలిపోతున్న కొడుకు ''మామ్'' అని నిస్సహాయంగా పిలుస్తున్న ట్లనిపించింది కేటీకి.

గభాల్న లేచింది. శూన్యంలో నుంచి కొడుకు పిలుపు ప్రతిధ్వనిస్తున్నట్లుగా ఉంది. తల గింగురులు తిరిగిపోతోంది. అంతవరకు మత్తు పొరలలో అణగారిన మాతృహృదయం కరిగి లావా లా పొంగి గుండెల్ని చీల్చుకుంటూ ఒక్కసారి ఎగజిమ్మింది.

''విక్కీ డార్లింగ్-మైసన్, విక్కీ!'' అని శూన్యంలో నుంచి కొడుకును పిలుస్తూ విలపిస్తూ బిగ్గరగా అరిచింది. ఆ అరుపు గదిలో నుంచి బయట చీకట్లో చిట్లిపోతూ దూరంగా మంచులో

ఆ అరుపుకి అప్పారావు నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

చిలక హడిలి పోయి బిక్క చచ్చినట్లు ఊరుకుంది.

నిశ్శబ్దం ఆవరించుకొంది. ఫైర్ ప్లేస్ నుంచి లేచిన మంట వెలుగులో, కేటీ నీడ గోడమీద ఊగుతోంది. కేటీ కన్నీరు కారుస్తూ అప్పారావు దగ్గరగా వచ్చింది. తూలిపోబోయి అప్పారావుని పట్టుకొంది. ''అప్రావ్, తుమ్ కో మాస్టర్ మార్తారే? అచ్ఛా!'' అని కోపంతో పెదాల్ని పళ్లతో నొక్కిపట్టి అప్పారావు తలలోనికి వేళ్లు పోనిచ్చి బొడిపెల్ని, దెబ్బల్ని నిమురుతూ కోపంతో ఫైర్‌ప్లేస్‌లోకి చూస్తోంది. ఎర్రటి కాంతిలో కళ్లు మరింత ఎరుపెక్కి పిల్లల్ని పోగొట్టుకున్న ఆడపులి కళ్లలా క్రూరంగా ప్రతీకారాగ్ని జ్వాలలతో తీక్షణంగా ఉన్నాయి. ఆ కళ్లతోనే అప్పారావు కళ్లలోకి చూసింది. అప్పారావులో, ఆ మాతృమూర్తి విక్కిని చూస్తోంది. బయట గేటు తెరుచుకుంది.

అప్పారావు కిటికీలో నుంచి చూశాడు. రాస్ వస్తున్నాడు.

కొంప మునిగిపోయిందనుకున్నాడు.

''మేమ్ సాబ్ – బహూత్ రాత్ హోగయా – మాఫ్ కరో చుట్టీలేగా'',

'' అచ్ఛా, ఫికర్ మత్ కరో, – సబ్ ఠీక్ హోజాయెగా!'' అని చిలకని చూస్తూ అంది. అప్పారావు పెరటి తోటలో నుంచి దాటేసి చీకట్లో నక్కిపోయాడు.

బయట వెన్నెల పిండార బోసినట్లుంది. బంగళా ఆవరణలో నైట్‌క్వీన్ వాసనల్ని విరజిమ్ముతోంది. రాస్ గేటు తెరచుకుని సన్నగా ఈలవేసుకొంటూ చిన్న పరుగు తీస్తూ వరండా ఎక్కాడు. తెల్లవారు జాము చలి వణికించేస్తోంది. తలుపుతోసుకుంటూ ''హలో, హనీ'' అంటూ గదిలో ప్రవేశించాడు. చిలక పంజరం మీద మీట వేస్తోంది కేటీ. పలక లేదు. నిలువుటద్దంలో రాస్ తన పొడుగాటి విగ్రహాన్ని చూసుకొంటూ బ్లాక్ బౌ తీసి కోటు విప్పి స్టేండుకు తగిలిస్తూ అద్దం మీద కేటీ పెదాల ముద్రలు చూసి'' హౌ స్వీట్'' అని వేలితో తాక బోతూ ఆగి పెదాలతో వాటిని కిస్ చేశాడు. తీపిగా పెదాల్ని చప్పరించుకుంటూ కేటీ దగ్గరకు వస్తూ ''డామ్ పార్ట్‌నర్! డజంట్ నో హౌటు డాన్స్ లవుజీకంట్'' అని బాల్ డాన్స్‌లో తగిలిన మేరీని తిట్టుకుంటున్నాడు.

కేటీ మౌనంగా పంజరంలోకి తీక్షణంగా చూస్తోంది.

''వాట్, యూ ఆర్ సైలెంట్. టిప్సీ మైడియర్?'' అని దగ్గరగా వచ్చి కేటీ నడుం మీద చెయ్యి వేశాడు.

త్రాచుపాములా సర్రున వెనక్కి తిరిగి రాస్‌ని ఒక్క తోపు తోసింది. రాస్ ముఖానికి విస్కీ వాసన గుప్పున కొట్టింది. కేటీ కోపంతో బుసలు కొడుతోంది. అర్థంకాని రాస్ ''ఏయ్, డార్లింగ్! డ్రింక్ టూ మచ్?''

''మైఫుట్, యు బ్లైటర్!'' అని గర్జించింది.

''డార్లింగ్; యూ ఎప్పియర్ సీరియస్?''.

''యూ బాస్టర్డ్! సన్ ఆఫ్ ఎ బిచ్... ఫక్ యూ...'' అని బూతులు లంకించుకుంది. పంజరంలో చిలక కూడా ''ఫకాఫ్.. ఫకాఫ్.. ఫకాఫ్ ''మని .. పీంద్రించుకుంటూ తిడ్తోంది.

ఇటు దొరసాని, అటు చిలక– బూతులతో గది మార్మోగిపోతోంది.

కేటీ చేతికందిన వస్తువుని గోడకేసి కొట్టింది. అద్దం పగలగొట్టేసింది. ఫర్నిచర్‌ని చిందర

వందరగా కాళ్లతో తన్ని బీభత్సాన్ని సృష్టించేస్తోంది. ''యూ ఇన్‌హ్యూమన్ బాస్టర్డ్- బ్లడీ లౌట్- యు ఆర్ బీటింగ్ యువర్ సర్వెంట్స్ - క్రూయల్ రాస్కెల్!'' అంటూ పులిలా రాస్‌మీదికి దూకి కళ్లు పీకే బోయింది.

''డార్లింగ్, ఆర్ యు మేడ్? ఏయ్! వాట్ హేపెండ్?'' అని కేటీనిపట్టుకున్నాడు. గింజుకుంటూ బుసలు కొడుతూ రాస్‌ని బకిరేస్తోంది.

''యు ఆర్ కిల్లింగ్ అప్రావ్.. హి ఈజ్ మై సన్! యూ ఆర్ కిల్లింగ్ విక్కీ! విక్కీ మైడియర్ విక్కీ మై సన్!'' అని గావు కేకలు పెడుతూ హిస్టీరిక్‌గా ఏడ్చుకుంటూ పక్క గదిలోకి వెళ్ళి దబాలున తలుపు వేసేసింది.

ఇదంతా అర్థంకాక రాస్ చెమట్లు కక్కుకుంటూ ఒళ్లంతా బకుర్లుతో చాలా సేపు కుర్చీలో కూలబడ్డాడు.. తర్వాత మెల్ల మెల్లగా అర్థం అయిపోయింది.

ఇదంతా చాటుగా కిటికీ లోంచి చూస్తున్న అప్పారావు నక్కలా చీకట్లో జారుకున్నాడు.

''దటీజ్ మెటర్నల్ ఇన్‌స్టింక్ట్'' అని జాలిగా కేటీ గదివైపు చూశాడు. సిగరెట్టు వెలిగించి శూన్యంలోకి పొగని వదులుతూ'' అప్రావ్, యూ బ్లడీ ఫాక్స్!'' అని నవ్వుకున్నాడు.

★

(ఆంధ్రప్రభ వీక్లీ: 6-11-1991)